క్లుప్తంగా

రేపు ఉద్యోగమేళా

పెబ్బేరు రూరల్: జిల్లా ఎంప్లాయిమెంటు కార్యాలయం వనపర్తి వారి ఆధ్వర్యంలో, శనివారం జిల్లాలోని నిరుద్యోగులకు అపోలో హోంకేర్, హోంకేర్ నర్సింగ్ అసిస్టెంట్, ఐఐఎఫ్ఎల్, ఐసీఐసీఐలో ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంటు అధికారి మహ్మద్ జానిపాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వతరగతి, ఇంటర్, ఆపై చదివిన వారికి 150 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఈ నెల 26న ఉదయం 10.30గంటలకు వనపర్తిలో పీఎంకేకే సెంటర్ సరస్వతీ శిశుమందిరం, రామాలయం దగ్గరికి అర్హత, ఆసక్తి గల వారు బయోడెటాతో హాజరుకావాలని కోరారు. ఇతర వివిరాలకు ఎంప్లాయిమెంట్ కార్యాలయ సిబ్బంది ఫోన్ నంబర్లు 9948568830, 9550205227లను సంప్రదించాలన్నారు.

స్వాగత ర్యాలీని జయప్రదం చేయండి

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించిన తర్వాత ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కొల్లాపూర్ నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా శుక్రవారం నిర్వహించే స్వాగత ర్యాలీని జయప్రదం చేయాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. . మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

వీపనగండ్ల: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి కతలప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో చేపడుతున్న అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు పూర్తి వివరాలతో సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా బద్రోద్దీన్ షావలి దర్గా ఉర్సు



ఖిల్లాఘనపురం: మండలంలోని తిర్మలాయపల్లి శివారులోని బద్రోద్దీన్ షావలి దర్గా ఉర్సు ఉత్సవం గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దర్గా ఆవరణలో తినుబండారాలు, ఆటవస్తువులు, స్వీట్లు, గాజులు, మహిళల సామాన్లు తదితర స్టాళ్లను ఏర్పాటు చేశారు.

క్రమశిక్షణతో మెలగాలి



అమరచింత: ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులు మంచిగా చదువుకుని, మంచి అలవాట్లు పెంచుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్, డీపీఓ సురేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తింటూ వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, వార్డెన్ బెనర్జి, పలువురు పాల్గొన్నారు.

హీరో మోటర్స్ నుంచి కొత్త బైక్ ఆవిష్కరణ



కొత్తకోట రూరల్: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటర్స్ విడుదల చేసిన న్యూ గ్లామర్ వాహనాన్ని పట్టణంలో పద్మావతి హీరో షోరూంలో స్థానిక కౌన్సిలర్ చింతలపల్లి సంధ్య గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల ఉత్పత్తిలో హీరో మోటర్స్ ముందంజలో ఉందన్నారు. అనంతరం షోరూం నిర్వహకులు పీ రవికుమార్ మాట్లాడుతూ అత్యధిక విజయవంతమైన గ్లామర్ 125 మోడల్‌ను బీఎస్-6 లోకి అప్‌డేట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టూ వీలర్స్ మెకానిక్ సంఘం అధ్యక్షుడు రఫిక్, షోరూం సిబ్బంది జగన్, అస్నాన్, సాయి, సంధ్య, మీనాక్షి, శివ, శ్రీకాంత్, గణేష్, మహేష్, కిషోర్, రాజు, శేఖర్, అనిల్, ఫైనాన్షియర్స్ శ్రీకాంత్, వెంకట్‌స్వామి, రాజు, ప్రవీణ్, సహదేవ్, హరి, భీంరెడ్డి, జీవన్, భాను ఉన్నారు.

వైద్య సేవలకు ఆటంకం

- నిరసనలో రెండో ఏఎన్ఎంలు
- ఇబ్బందుల్లో పల్లె ప్రజలు



తహసీల్దార్‌కు సమ్మె నోటీస్ అందిస్తున్న రెండో ఏఎన్ఎంలు (ఫైల్)

పాన్‌గల్: ఒప్పంద రెండో ఏఎన్ఎంల సమ్మెతో పల్లెల్లో వైద్య సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని ఆగస్టు 4న నుంచి ఒప్పంద పద్ధతిన చేపట్టిన రెండో ఏఎన్ఎంల నిరసనలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఆగస్టు 16వ తేదీ నుంచి సమ్మెబాట పట్టారు. దీంతో ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో అంతంత మాత్రంగా అందుతున్న వైద్య సేవలు వారి సమ్మెతో మరింత మందగించి రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

సేవలపై ప్రభావం..

రెండో ఏఎన్ఎంలు విధులకు రాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు కుంటుపడ్డాయి. ప్రతి బుధవారం గర్భిణులకు, చిన్నపిల్లలకు వ్యాక్సిన్ వేయాల్సి ఉంది. దీంతో ఆ ప్రక్రియ నిలిచిపోవడంతో వ్యాక్సిన్‌కు దూరంగా ఉన్నారు. చాలా మేరకు ఆన్‌లైన్ సర్వీసులు నిలిచిపోయాయి. ఏఎన్ఎంలు విధులు నిర్వహించే గ్రామాల్లో కుష్ఠ వ్యాధి సర్వే సైతం అంతంతమాత్రంగా సాగుతోంది. రెగ్యులర్ ఏఎన్ఎంలకు పనిభారం పెరగడంతో తలలు పట్టుకుంటున్నారు. పాన్‌గల్ మండలంలో 7గురు, చిన్నంబావిలో 6గురు, వీపనగండ్లల్లో 4 గురు రెండో ఏఎన్ఎంలు సమ్మెలో ఉన్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలు అందడం లేదు. ప్రభుత్వం స్పందించి సమ్మెను విరమింపజేసి ప్రజలకు వైద్య సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మండలాల వారీగా రెండో ఏఎన్ఎంల వివరాలు..

మండలం	రెండో ఏఎన్ఎంలు	రెగ్యులర్ ఏఎన్ఎంలు
పాన్‌గల్	07	05
చిన్నంబావి	06	01
వీపనగండ్ల	04	01

రెగ్యులరైజ్ చేయాలి..



ఎన్నో సంవత్సరాలుగా రెగ్యులర్ ఏఎన్ఎంలతో సమానంగా విధులను నిర్వహిస్తున్నాం. రెండో ఏఎన్ఎంలను ఎలాంటి పరీక్షలు లేకుండా రెగ్యులరైజ్ చేయాలి. ఇటీవల విడుదల చేసిన మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి. ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు సమ్మెను కొనసాగిస్తాం.

– సుమిత్ర, రెండో ఏఎన్ఎం, పాన్‌గల్

సమ్మెతో పేదలకు ఇబ్బందులు..



రెండో ఏఎన్ఎంల సమ్మెతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడింది. పేదలకు వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. రెండో ఏఎన్ఎంలు విధులు నిర్వహించే సబ్‌సెంటర్లు పూర్తిగా మూతపడ్డాయి. గర్భిణీలు, చిన్నపిల్లల వ్యాక్సిన్‌కు దూరంగా ఉన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమ్మెను విరమింపజేయాలి.

– కళావతమ్మ, సీపీఐ నాయకురాలు, కేతేపల్లి

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం..



రెండో ఏఎన్ఎంల సమ్మెతో వైద్యసేవలపై ప్రభావం ఉన్నది వాస్తవమే. జిల్లా అధికారుల ఆదేశానుసారం సమ్మె కారణంగా పేదలకు వైద్య సేవలు అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. వ్యాక్సినేషన్ తీసుకునే వారు పీహెచ్‌సీకి వచ్చి వేయించుకోవాలి.

– డా.చిరంజీవి, పీహెచ్‌సీ పాన్‌గల్

ఓటరు నమోదుకు అవకాశం



మదనాపురంలో మాట్లాడుతున్న తహసీల్దార్

మదనాపురం: కొత్త ఓటర్లు నమోదు చేసుకునే అవకాశం ఈనెల 26, 27, సెప్టెంబర్ 2, 3, తేదీల్లో ఎన్నికల కమిషన్ కల్పించిందని తహసీల్దార్ అబ్రహం లింకన్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయా తేదీల్లో బీఎల్ఓలు గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర ఉండి నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవరకద్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి నట్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పూర్తి చేయాలి..

ఆత్మకూర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ పూర్తి చేయాలని తహసీల్దార్ రాజు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. 2023 అక్టోబర్ 1నాటికి 18 ఏళ్లు నిండిన వారి వివరాలను సేకరించి నమోదు చేయించాలన్నారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని బూత్ లేవల్ అధికారులకు సూచించారు. బీఎల్ఓలకు మెటీరియల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్ఐలు జయమ్మ, నర్సింహులు, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్ఓలు ఉన్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ

పెబ్బేరు రూరల్: పట్టణంలోని వనపర్తి రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ కోరారు. ఈ సందర్భంగా విస్తరణ పనులకు రోడ్డుకు ఇరువైపుల ఇళ్లు, షాపులు కొంత మేరకు కోల్పోతున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని, పట్టణాభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, కమిషనర్ ఆదిశేషు, కౌన్సిలర్లు పార్వతిగౌడ్, చిన్న ఎల్లారెడ్డి, మేకల సుమతి, టౌన్ ప్లానర్ వరప్రసాద్, మేనేజర్ గణేష్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణలో కొలువుల కరువు



జీఓ జిరాక్స్ ప్రతులు తగలబెడుతున్న రెండో ఏఎన్ఎంలు

పెబ్బేరు రూరల్: కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కొత్త కొలువులు, ఉద్యోగ భద్రత కరువైందని సీపీఐ జిల్లా కార్యదర్శి కే విజయరాములు విమర్శించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని రెండో ఏఎన్ఎంల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ జిరాక్స్ పత్రాలను తగులబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసం పోరాడి వేలాది మంది అమరులయ్యారన్నారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో ఉద్యోగాల క్రమబద్ధీకరణకు ఏఎన్ఎంలు, స్వీపర్లు, నిరుద్యోగులు, వివిధ శాఖల కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పోరాటాలు చూస్తుంటే తెలంగాణ లక్ష్యం నెరవేరలేదని అన్నారు. క్రమబద్ధీకరించే వరకు సీపీఐ వారికి అండగా ఉంటుందన్నారు కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, లక్ష్మమ్మ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష, సుమిత్ర, పార్వతి, రాధ, శ్రీదేవి, శారద, లావణ్య, లలిత పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పాన్‌గల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా గెలిపిస్తే గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డా.పగిడాల శ్రీనివాసులు అన్నారు. ఇంటింటికి టీడీపీ ప్రచారంలో భాగంగా గురువారం దొండాయిపల్లి, దొండాయిపల్లి తండాల్లో పర్యటించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సు. దామినీ, డా.పగిడాల సాయిదీరజ్, గోపాలకృష్ణనాయుడు, స్వరూప, జగదీశ్వర్‌గౌడు, తాళ్ల కృష్ణ, స్వామి, మల్లేష్‌యాదవ్, రాకేష్‌యాదవ్ పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయంతో సంబరాలు



జాతీయ జెండాను పట్టుకొని ఆనందం వ్యక్తం చేస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్

కొత్తకోట రూరల్: శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచంలోనే భారతదేశం దూసుకెళ్తోందని, అందుకు చంద్రయాన్-3 విజయమే నిదర్శనమని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని యోగ టీం సభ్యులు, జైభారత్ వాకింగ్ టీం సభ్యులు గురువారం జాతీయ జెండాతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వామన్‌గౌడ్ మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఇదొక అద్భుత ఘట్టమని, చంద్రయాన్-3 విజయం కావడానికి కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి, అమృతరెడ్డి, శేఖర్‌రెడ్డి, బ్రహ్మం, వెంకటయ్యచారి, నాగిరెడ్డి, కృష్ణయ్యసాగర్, సత్యంసాగర్, శేఖర్‌రెడ్డి, సంతోష్, భాస్కర్, యాదిరెడ్డి, ఈశ్వర్, కిషన్‌నాయక్, భాస్కర్‌యాదవ్, మిస్సేక్, రామస్వామి, బాలరాజుచారి, దంతేశ్వర్, లక్ష్మయ్య, కురుమూర్తి, రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాస్‌సాగర్, నర్సింహచారి, హరికృష్ణ, చంద్రాయుడు, బుచ్చన్న ఉన్నారు.



ఆత్మకూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

విద్యార్థుల ర్యాలీ..

ఆత్మకూర్: చంద్రుడిపై జాతీయ జెండా రెపరెపలాడి చంద్రయాన్ 3 విజయంపై గురువారం ఆత్మకూర్‌లో శ్రీవాణి హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ టీజీ విశ్వేశ్వర్ మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఫలించిందని, ప్రతి భారతీయుడిని గర్వంగా తలెత్తుకునేలా చేసిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనంతో సింగిరెడ్డి వాసంతి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం, వడ్డెర గేరి కాలనీల్లో గురువారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను అందంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ ఉత్సవంలో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి హాజరై బోనం ఎత్తి కొంతసేపు మహిళలతో కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు. గౌర్రె పొట్టేళ్లతో అమ్మవారి బోనాన్ని లాంగించారు. పోతురాజులు, అమ్మవారి వేషాధారణతో భక్తులు అలరించారు. కార్యక్రమంలో మహిళలు, పెద్దలు, యువకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ప్రమోద్‌కుమార్‌రెడ్డి, నాయకులు

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని మెంటెపల్లిలో గురువారం బీఆర్ఎస్ నాయకులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు బీఆర్ఎస్ వనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త వంగూరు ప్రమోదుకుమార్‌రెడ్డి, శిక్షణ కార్యక్రమాల జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్, హనుమాన్ యూత్, వివిధ పార్టీలకు చెందిన 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి వంగూరు ప్రమోదు కుమార్ రెడ్డి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాణిక్యం, సర్పంచ్ మంద రామకృష్ణ, ఉపసర్పంచ్ హనుమంతు, గ్రామ కమిటీ అధ్యక్షుడు తిరుపతయ్య, రాములు, కే గిరి, రామకృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫిజియోథెరపీ



భవిత కేంద్రంలో అంగవైకల్య చిన్నారికి ఫిజియోథెరపీ

అమరచింత: పట్టణంలోని భవిత కేంద్రంలో ప్రతి గురువారం అంగవైకల్యం గల చిన్నారులకు ఉచితంగా ఫిజియోథెరపీ నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ భాస్కర్ సింగ్ తెలిపారు. డీఎంఆర్ఎం ప్రభుత్వ పాఠశాలలోని భవిత కేంద్రంలో గురువారం ఉచిత ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు పవన్‌కుమార్, భవిత సెంటర్ టీచర్లు స్వప్న, బాలమణి, డీఎంఆర్ఎం హెచ్ఎం బాలస్వామి, కిరణ్, రమేష్ పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలు పెంపొందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

పెబ్బేరు రూరల్: బోధనకు సంబంధించిన పరికరాల ప్రదర్శనతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతందని ఎంఈఓ జయరాములు అన్నారు. జిల్లా సెక్టోరియల్ అధికారి యుగంధర్‌తో కలిసి గురువారం ఆయన శ్రీరంగాపురం మండల కేంద్రం, నాగసానిపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించి తరగతి గదుల్లో బోధన విధానాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఎచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక



ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

వీపగండ్ల: మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. మండల స్థాయి అండర్-14, 17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ జట్ల ఎంపికలో మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఎస్ఎంసీ చైర్మన్ రమేష్ ఉన్నారు. కార్యక్రమంలో పీఈటీ షఫీర్ ఉన్నారు.



కబడ్డీలో మొదటి బహుమతి అందుకున్న కొత్తకోట బాలికల పాఠశాల విద్యార్థినులు

అట్టహాసంగా ఎస్‌జీఎఫ్ కీడాపోటీలు..

కొత్తకోట రూరల్: మండల స్థాయి పాఠశాల క్రీడలు గురువారం మండలంలోని అమడబాకుల జెడ్పీహెచ్‌లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంఈఓ కృష్ణయ్యలు ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుచ్చన్న, ఎస్ఎంసీ చైర్మన్ శంకర్, ఎంపీటీసీ శేషిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసులు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రామ్మోహన్, పీఈటీలు పాల్గొన్నారు.

'ప్రజలను మద్యానికి బానిస చేస్తున్నది ప్రభుత్వమే'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందించడం మానేసి గ్రామ గ్రామాన ప్రభుత్వమే ప్రజలను మద్యానికి బానిసలను చేస్తోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడు, మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2018లో వేసిన శిలాఫలకాలకు దిక్కు లేదని, ఇప్పుడు ఎక్కడ పడితే అక్కడ శిలాఫలకాలు వేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి రాంరెడ్డి, ఓబీసీ కార్యదర్శి ఆశన్న, సత్యనారాయణ, మల్లేష్, దశరథం, భద్రయ్య, కొండల్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు



సుందరమ్మ(ఫైల్)

పాన్‌గల్: మండల కేంద్రంలో మహిళ అదృశ్యమైన ఘటనలో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వేణు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండల కేంద్రం పాన్‌గల్‌కు చెందిన సుందరమ్మ(65) భర్తతో కలిసి ఉంటోంది. బుధవారం ఆమె భర్త బాలకిష్టారావు గ్రామ శివారులోని వ్యవసాయ పొలానికి వెళ్లగా ఆమె ఇంట్లోనే ఉన్నది. పొలం నుంచి ఇంటికి వచ్చిన ఆయనకు ఇంట్లో భార్య కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో ఎక్కడ వేతికినా ఆచూకి లభించలేదు. గురువారం ఆయన భార్య తప్పిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కళాశాలలో మద్యం సీసాలు



పెబ్బేరు రూరల్: శ్రీ రంగాపురం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగి సీసాలను వరండాలో పగుల గొట్టారు. దీంతో వరండా నిండా గాజు పెంకులున్నాయని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం కళాశాలకు వచ్చిన విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొన్నారు. దీనిపై పోలీసులు గస్తీ ఏర్పాటు చేసి కళాశాలలో మద్యం తాగిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం



పెబ్బేరు రూరల్: శ్రీ రంగాపురం మండలంలోని కంబాళాపురం గ్రామానికి చెందిన ఈర్ల బాలకృష్ణ బుధవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మండల యూత్‌కాంగ్రెస్ నాయకులు పెద్దమందడి ఎంపీపీ తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి బాధితులకు రూ.5వేలు పంపించారు. ఆయన పంపిన ఆర్థిక సాయం గురువారం కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో చిన్నాగౌడు, ఆశన్న, ప్రవీణ్‌కుమార్, ఈశ్వర్, రాజు ఉన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన నాయకులు



ఎమ్మెల్యే చిట్టెంను సన్మానిస్తున్న నాయకులు

ఆత్మకూర్: మక్తల్ స్థానం నుంచి చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి బీఆర్ఎస్ టిక్కెట్ కేటాయించడంతో గురువారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ప్రతి ఒక్కరి సంక్షేమమే ధ్యేయంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీను, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండోఅధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్ఎంపీపీ కోటేష్, రైతు సంఘం అధ్యక్షుడు వీరేశలింగం, మార్కెట్ వైస్‌చైర్మన్ వేణురెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.